ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 09 జనవరి , 2026 | పేజీలు : 06

## సిపిఐ వందేళ్ల ముగింపు బహిరంగ సభను విజయవంతం చేద్దాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి




**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** సిపిఐ అఖిల భారత స్థాయి ముగింపు ఉత్సవాలు జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ 100 సంవత్సరాల ముగింపు భారీ మహాసభకు 40 దేశాల నుండి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు పాల్గొంటారని వారు తెలిపారు. ప్రజలు పార్టీ నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, కౌన్సిల్ సభ్యులుజక్క దయాకర్ రెడ్డి, గుర్రం రాజమణి, మండల సహాయ కార్యదర్శి ఎండి.నయుం పాల్గొన్నారు.

# సమస్యలు లేని పట్టణంగా నల్లగొండను తీర్చిదిద్దుతా

### అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** సమస్యలు లేని పట్టణంగా నల్లగొండను తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.గురువారం ఆయన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అన్నేశ్వర గుట్ట వద్ద అమృత్2 పథకం కింద కోటి నలభై ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 1100 కిలో లీటర్ల తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. మూడు కోట్ల 14 లక్షల 60000 వ్యయంతో వల్లభరావు చెరువు సుందరీ కరణ పనులకు శంకుస్థాపన చేశారు.లెప్రసీ కాలనీలో 3 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు.లతీఫ్ సాబ్ గుట్ట సమీపంలో 50 లక్షల రూపాయల టి ఏ టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో నిర్మించిన ఎస్ ఈ2 యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 68.83 లక్షల రూపాయల వ్యయంతో సుందరీకరించనున్న మోతి కుంట పనులకు శంకుస్థాపన చేశారు.నూతనంగా ప్రారంభించిన ఎస్ ఈ కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలలో మున్సిపాలిటీని మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు చేస్తూ బిల్లు పాస్ చేయడం జరిగిందని కృతజ్ఞతలు తెలిపారు.మేలో జరగనున్న మేయర్ ఎన్నికల్లో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కు తొలి మేయర్ రానున్నారని ఆయన వెల్లడించారు.పట్టణంలో 272 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,నీటి సరఫరా పథకాలను చేపట్టడం జరిగిందని, 53 కోట్ల రూపాయలతో టి యుఎఫ్ ఐడిసి ద్వారా రోడ్లు, మురికి కాలువల నిర్మాణం పనులు జరుగుతున్నాయని, మరో 109 కోట్లతో సి సి రోడ్లు,9 కోట్ల రూపాయలతో పట్టణం నలువైపులా సబ్ స్టేషన్లను చేపట్టడం జరిగిందని ,అందులో భాగంగా గురువారం రెండు సబ్ స్టేషన్లు ప్రారంభించుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనల కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,ఆర్ డి ఓ వై అశోక్ రెడ్డిమాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బాగోని రమేష్ గౌడ్, ప్రజారోగ్య పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

# కొలనుపాక క్షేత్ర అభివృద్ధిపై ఎంపి చామల ఫోకస్

### నిధులు కేటాయించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు ఎంపి విన్నపం

### 17 నుండి 21 వరకు అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ రంభపురి జగద్గురువుల 35వ 'పీఠారోహణ'







**ప్రజాపక్షం/ఆలేరు :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని చారిత్రక శైవ క్షేత్రం, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కొలనుపాక శ్రీ చండికాంబ సమేత స్వయంభూ సోమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిపై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వీరశైవ మతానికి ప్రధాన కేంద్రంగా 18 కులాలకు సంబంధించిన మఠాలతో విరాజిల్లుతున్న ఈ పురాతన క్షేత్రాన్ని పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే పార్లమెంట్ వేదికగా ఆలయ విశిష్టతను ప్రస్తావించిన ఎంపీ, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను స్వయంగా కలిసి ఆలయ సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. ఆలయ నిర్వహణలో స్థానికులకు, మఠాల ప్రతినిధులకు మధ్య ఉన్న సుదీర్ఘకాలపు విభేదాలను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సామరస్య పూర్వకంగా పరిష్కరించి, అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడం విశేషం. ఈ క్రమంలోనే ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్లతో కలిసి ఆలయ పురోగతిపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. పురాతన కట్టడాలను సంరక్షిస్తూనే భక్తులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే తమ లక్ష్యమని నేతలు స్పష్టం చేశారు. కాగా, 2026 జనవరి 17 నుండి 21 వరకు కొలనుపాకలో అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ రంభపురి జగద్గురువుల 35వ సంవత్సర 'పీఠారోహణ' మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చత్తగశి మహారాజ్ ఖర్లాపూర్, కర్ణాటకకు చెందిన రాజేశ్వర్ శివాచార్య ఆడోళ, శ్రీ సోమశిలింగ శివాచార్య మహా స్వామి, శ్రీ వీరూర్ విజయ్ కుమార్ తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమ విశిష్టతను చాటిచెప్పారు. ఈ పీఠారోహణ ఉత్సవాల సందర్భంగా కొలనుపాక క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది.

## యూరియా సరఫరాలో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** యూరియా సరఫరాలో పారదర్శకతతో పాటు రైతులకు సులభ సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ తెలిపారు. నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన నకిరేకల్ మండల కేంద్రంలో యూరియా బుకింగ్ యాప్ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక ఎరువుల దుకాణాన్ని సందర్శించిన ఆయన, యాప్ ద్వారా యూరియా బుకింగ్, కొనుగోలు విధానాన్ని పర్యవేక్షించి రైతులతో మాట్లాడారు. రైతులు తమ ఇంటి నుంచే యూరియా లభ్యతను తెలుసుకుని, పంటల అవసరానికి అనుగుణంగా బుక్ చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా లభిస్తుందని ఆయన తెలిపారు.యూరియా పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా పారదర్శక విధానంలో సరఫరా జరగాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా పట్టాదారు రైతులతో పాటు కౌలు రైతులు, భూమి ఉండి పట్టా లేని రైతులు కూడా యూరియాను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి. శ్రవణ్ కుమార్,జిల్లా సహకార అధికారి ఎం.పాత్యా నాయక్, నకిరేకల్ సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ జాని మియా,వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.కె. హిదయతుల్లా,ఏ.లింగయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## సరిపడా యూరియా నిల్వలు

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** యూరియా కొరత జిల్లాలో లేదని సరిపోను యూరియా నిల్వలు ఉన్నాయని రైతులెవరు అధైర్యపడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మండలంలోని పిల్లలమర్రి పిఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్, ఈ పాస్‌మిషన్‌లను పరిశీలించారు. ఇప్పటి వరకు పిల్లలమర్రి పిఏసిఎస్ ద్వారా 290.43 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకి పంపిణీ చేశామని ప్రస్తుతం 11.90 మెట్రిక్ టన్నుల (266 బస్తాల) యూరియా నిల్వలు ఉన్నాయని ఇంకో 100 మెట్రిక్ టన్నుల యూరియా అయితే ఈ యాసంగి సీజన్‌కు సరిపోతుందన్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి మరో రెండు లారీల యూరియా లోడ్లు వస్తుందని ఏడిఏ కలెక్టర్‌కు వివరించగా ఎంత యూరియా అవసరం ఉంటే అంత సరఫరా చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ అక్కడ ఉన్న రైతులతో మాట్లాడుతూ ఎరువులు మంచిగా సరఫరా చేస్తున్నారా, ఒక ఎకరం వరి పంట ద్వారా ఎంత ఖర్చవుతుంది, ఎంత దిగుబడి వస్తుందని అడగగా రూ.25వేల వరకు ఖర్చు అవుతుందని, రూ.33వేలు మిగులుతాయని వివరించారు. సాంప్రదాయ పంటలైన వరి నుండి అధిక లాభాలు వచ్చే పామాయిల్, కూరగాయల సాగువైపు రైతులు దృష్టిపెట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట డిసిఓ ప్రవీణ్ కుమార్, తహశీల్దార్ కృష్ణయ్య, ఏడిఏ జ్ఞానేశ్వరి దేవి, ఏఓ కృష్ణ సందీప్, ఏఈఓ స్వాతి, పిఏసిఎస్ కార్యదర్శి శ్యామ్‌సుందర్ రెడ్డి ఉన్నారు.



## ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/వలిగొండ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ టియు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి అన్నారు. గురువారం వలిగొండ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10న సూర్యాపేటలో జరుగు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్, రాష్ట్ర నాయకులు మోహన్ బైరాగి చార్వాక, బాకారం లావణ్య, పబ్బు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి హాకీ పోటీకి ఎంపిక




**ప్రజాపక్షం/రామన్నపేట :** జాతీయ స్థాయి హాకీ పోటీలకు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నోముల సాయి కుమార్ ఎంపికయ్యారు. బుధవారం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం నందు జరిగిన ఎంపిక ప్రక్రియ పోటీలో పాల్గొని ఈ నెల 12న తమిళనాడులోని సత్యభామ విశ్వ విద్యాలయం నందు జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆడనున్నట్లు తెలిపారు. సాయి కుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందుకు తోటి విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ, సంతోషంతో సాయి కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపి, జాతీయ స్థాయిలో జరిగే పోటీలో మంచి ప్రతిభ కనబరిచి, విజేతగా నిలిచి తల్లిదండ్రులకి, కళాశాలకి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## మిత్రుడికి సన్మానం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సిరిపురం గ్రామానికి చెందిన మిత్రులు సుక్క శ్రవణ్ కుమార్ నియామకం సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తెలుగుదేశం పార్టీ రామన్నపేట బీసీ సెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, శివాలయం చైర్మన్ రాపోలు రమేష్, మాజీ వార్డు సభ్యులు సాయిని శేఖర్ పాల్గొన్నారు.

## పాలకవర్గానికి సన్మానం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం అర్రూరు గ్రామ పంచాయతీ మొదటి పాలకవర్గం సమావేశంలో 12 మంది వార్డ్ సభ్యులు మరియు ప్రజల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి పాల్గొని నూతన సర్పంచ్ సుక్క ముత్యాలు, ఉప సర్పంచ్ గొడ్డేటి సత్యం యాదవ్‌కు ఇటీవల రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సర్పంచ్ ఉప సర్పంచ్‌లకు సన్మానం చేసిన ఫోటో ఫ్రేములను బహూకరించారు.



## మహిళలకు స్వేచ్ఛా వాతావరణం కల్పించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పని ప్రదేశాలలో మహిళలకు స్వేచ్ఛ వాతావరణం కల్పించాలని జిల్లా కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మమతా హోటల్ నందు మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డిహెచ్ఇడబ్లు) ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధక చట్టం పోష్ (పిఓఎస్‌హెచ్) యాక్ట్ 2013 పై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న తరుణంలో, వారు పని చేసే చోట ఎదురయ్యే వేధింపులను అరికట్టడానికి ఈ చట్టం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఐసిసి కమిటి 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో తప్పనిసరిగా ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటి (ఐసిసి) ఉండాలని కోఆర్డినేటర్ చైతన్య స్పష్టం చేశారు. అదేవిధంగా లైంగిక వేధింపుల నిర్వచనం, ఫిర్యాదు చేసే విధానం, బాధితులకు చట్టం కల్పించే రక్షణల గురించి వివరించారు. పని ప్రదేశంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు మహిళలు మౌనంగా ఉండకుండా, ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్, భవ్య, హోటల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆండాళ్ అమ్మవారికి నవ కలశ పూర్వకంగా పంచామృతాభిషేకం

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయమే శ్రీ ఆండాళ్ అమ్మవారికి నవ కలశ పూర్వకంగా పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం. స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ, తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్ఛారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. ప్రతిరోజు



స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రజల ప్రాణాలను హరిస్తున్న మద్యం మాఫియా



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కల్తీ మద్యం వల్ల ప్రజల ప్రాణాలు హరి అంటున్నాయని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్‌కుమార్ అరోపించారు. గురువారం గరిడేపల్లి మండలంలోని వైన్స్ సిండికేట్ దుకాణం ముందు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. 110 రూపాయలకు అమ్మాల్సిన క్వారర్ మందును 140 రూపాయలకు విక్రయిస్తూ మందుబాటుల జేబులకు చిల్లులు పెడుతున్నారని, ఈ మధ్య కాలంలో అనేక మంది బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల దారిద్రరేఖకు దిగువున జీవిస్తున్న నిరుపేదలు తమకున్న బలహీనత వల్ల ఛీప్‌క్వార్టర్ తాగడం వల్ల అనేక మంది మరణిస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మద్యం మాఫియాను అరికట్టేందుకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ వారు రంగంలోకి దిగి దోషులను అరెస్టు చేసి అసలు కల్తీ లిక్కర్ ఎక్కడ తయారవుతుందో కూపిలాగి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ బ్రాండ్ల మందులు 20నుండి 40 శాతం కమిషన్ అందిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మాత్రమే వైన్‌షాపు యాజమాన్యం సిండికేట్‌గా ఏర్పడి 15నుండి 45 శాతం ఎమ్మార్పీ కంటే అదనంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ల సతీష్‌కుమార్, అమరావరపు వెంకటేశ్వర్లు, రాం సైదులు, పిడమర్తి అంజి, రంపంగు సైదులు, కత్తీ రవీందర్, కుర్రి శివ, సురేష్ బాబు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**ప్రజాపక్షం/మునగాల:** రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోదాడ ఎంవిఐ రాజమహ్మద్, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక న్యూప్రజ్ఞ పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారీన పడుతూ తమ విలువైన ప్రాణాలను పొగొట్టుకోవడమే కాకుండా తమను నమ్ముకున్న కుటుంబాల భవిష్యత్‌ను కూడా నాశనం చేస్తున్నారని, ఎంతో మంది వివిధ ప్రమాదాలలో అంగవైకల్యంకు గురై జీవితాంతం నరకయాతన అనుభవిస్తూ వారి కుటుంబాలను పోషించడానికి కూడా సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించిందని



అన్నారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, నడిగూడెం ఎస్ఐ అజయ్‌కుమార్, మోతె ఎస్ఐ అజయ్, న్యూప్రజ్ఞ స్కూల్ కరస్పాండెంట్ కాచాని కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## గోడ పత్రికను ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఆలేరు :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వార్షికోత్సవం పురస్కరించుకొని ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం ఆలేరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శత వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభ గోడ పత్రికలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, నాయకులు తెడ్డు ఆంజనేయులు స్వామి, పల్లె శ్రీనివాస్, కందుల మధు పాల్గొన్నారు.

## రిసెప్షన్ సెంటర్ పరిశీలన



**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి మండలం దివ్య బాల స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ & రిసెప్షన్ సెంటర్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మరియు రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు గురువారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన కౌంటర్లు, సామగ్రి పంపిణీ ఏర్పాట్లు, రిసెప్షన్ డెస్కులు, నియంత్రణ గదులు, భద్రతా చర్యలు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలను అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా సమయపాలనతో పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ కమీషనర్ రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే దీక్షలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలలో రాజకీయ లబ్ధి కోసమే రిలే నిరాహార దీక్షలు చేపట్టి చేనేత కార్మికులను పక్కదోవ పట్టిస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని డైవర్ట్ పొలిటిక్స్‌తో కుయుక్తులు పన్నుతున్నారని సంక్రాంతి లోపు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ రుణమాఫీ పూర్తి చేసి ప్రభుత్వం ఖాతాలో డబ్బులు జమ చేస్తుందని టై అండ్ డై అధ్యక్షుడు భారత లవ కుమార్ మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత పద్మశాలి కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు సురపల్లి శ్రీనివాస్, గంజి అంజయ్య, భక్తాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ కడవేరు వెంకటేష్ ఉన్నారు.

## బాధితులకు అండగా ఉంటా

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ పరిధిలోని చెరువు కట్ట ప్రాంతంలో గ్రీన్ ట్రిబ్యునల్ పేద మీద నోటీసులు అందుకున్న పలు ప్రాంతాలలో గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షులు బొల్లం మల్లయ్యయాదవ్ పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మీరు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని, మీకు అండగా నేను ఉంటానని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేతో ప్రజలు మాట్లాడుతూ తాము 50 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఉంటున్నామని, చిన్న, చితక కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, వచ్చిన డబ్బులతో ఎంతో కొంత దాచుకుని నిర్మాణాలు చేసుకున్నామని, ఈ కట్టిన ఇళ్లకు ప్రభుత్వం నల్లా బిల్లు, కరెంట్ బిల్లు, ఏ బిల్లులైన వసూలు చేసిందిన, అలాంటి పర్మిషన్లు ఇచ్చిన ప్రభుత్వం కోర్టుల పేరుతో ఇలా నోటీసులు జారీ చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





## నూతన సర్పంచ్ సన్మానం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సిపిఐ నుండి నూతనంగా ఏర్పడిన గానుగబండ సర్పంచ్ కడియాల పద్మ అప్పయ్యను గరిడేపల్లి మండలానికి చెందిన కల్మలచెర్వు, గంగానగరంకు చెందిన మున్నూరుకాపు సంఘం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్పంచ్‌గా మంచిపేరు తెచ్చుకోని, గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల పుల్లయ్య, దాసరి లక్ష్మయ్య, దాసరి వెంకటయ్య, దాసరి శ్రీను, పోలిబోయిన ధనమూర్తి, కంబాలపల్లి వెంకటనారాయణ, కొండేటి రామకృష్ణ, పోలేబోయిన నర్సయ్య, ఎడవెల్లి మురళి, పూనమ్‌రాములు, బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఎస్‌టియు డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మునగాల:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, బకాయిలో ఉన్న ఆరు డిఎలను, పిఆర్‌సి వెంటనే ప్రకటించాలని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, ఎస్టీయు సంఘం మండల అధ్యక్షులు సత్తూరి బిక్షంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయు డైరిని, క్యాలెండర్‌ను, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు శోభన్‌బాబు, ఎం.రవికుమార్, ఎస్టీయు నాయకులు అంజన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, కంచుగంటి వెంకటేశ్వర్లు, సుదర్శన్, శిరిష, శ్రీరామ్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కిట్స్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని స్థానిక కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గురువారం బిటెక్ ఈఈఈ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కోదాడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ విజిట్‌లో టిజి ట్రాన్స్‌కో విద్యుత్ ట్రాన్స్‌మిషన్‌కు సంబంధించిన స్టెప్స్‌ను, విద్యుత్ ప్రాధాన్యతపై అసిస్టెంట్ ఇంజనీర్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ల పల్లి గాంధీ, డైరెక్టర్ నాగార్జునరావు, వివిధ విభాగాదిపతులు డాక్టర్ శివాజీ, అధ్యాపకులు రామకృష్ణ, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ పార్కుకోసం గ్రామ సభ

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : మండలంలోని డి రేపాక గ్రామములో సర్వే నెంబర్ 165 ప్రభుత్వ భూమి ఇండస్ట్రియల్ పార్క్ కొరకు భూ నిర్వసితులను గుర్తించుటకు గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్తులు, రైతులు ఇండస్ట్రీయల్ పార్క్‌కు భూములు ఇవ్వం అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, టిజిఐఐసి జోనల్ మేనేజర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# రామాలయంలో వైభవంగా శోభయాత్ర



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని శ్రీ వేణుగోపాల సీతరామచంద్ర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా గురువారం వైభవంగా శోభయాత్రను నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. స్థానిక రామలయంలో జరిగిన శోభయాత్రలో ప్రతి ఏడాది అనవాయితీగా కన్నుల పండుగగా నిర్వహిస్తున్న శోభయాత్రను అత్యంత వైభవంగా 9 వాహనాలపై శ్రీ స్వామి వారులను అధిష్టింపజేసి మంగళవాయిద్యాలతో భజన కోలాటాలతో, మహిళల మంగళ హరతులతో, స్థానచార్యుల కుటుంబ సభ్యులు, అన్నమయ్య భజన మండలి, కీర్తనలతో, అర్చకులు వేద పండితుల వేద పఠనము మధ్య పుర వీధులలో శోభయాత్రను నిర్వహించారు. తదుపరి నీరాజన మంత్ర పుష్పములు, తీర్ధ ప్రసాద వినియోగము నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస గౌడ్ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.చరమందరాజు, పట్టణ ప్రముఖులు యరగాని నాగన్నగౌడ్, తన్నీరు మల్లిఖార్జున్‌రావు, దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, గూడెపు శ్రీనివాస్, కోట సూర్యప్రకాశ్‌రావు, గుండా రమేష్‌బాబు, చిట్యాల అమరనాథ్‌రెడ్డి, అట్లూరి హరిబాబు, జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్ గుండా ఫణికుమారి రాంరెడ్డి, పులిచింతల నారాయణరెడ్డి, కంచర్ల అరవింద్‌రెడ్డి, దేవరం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# బస్సును వెంటనే పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సూర్యాపేట డిపో నుండి గరిడేపల్లి మీదుగా అప్పిరెడ్డిగూడెం, లక్ష్మిపురం, సర్వారం, లింగగిరి మీదుగా మఠంపల్లి నైట్ ఆల్ట్ ఉండి తెల్లవారుజామున ఉదయం ఆరు గంటలకు బయలుదేరి గడ్డిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా బస్సు సర్వీస్‌ను నడపాలని సిపిఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ అన్నారు. గురువారం సూర్యాపేట ఆర్టీసీ డిపో కార్యాలయంలో అర్టీసీ జనరల్ ఎడిసి వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఇలాగే బస్సును నడిపారని, గత రెండు సంవత్సరాల నుండి బస్సు సర్వీస్ బంద్ చేశారని, దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట పట్టణానికి వివిధ అవసరాల రిత్యా వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్సు సర్వీస్‌నుప్రారంభించాలని కోరారు. గడ్డిపల్లి మోడల్ స్కూల్‌కు వచ్చే విద్యార్థులు సుమారు 11 కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారని, మార్గమధ్యలో కోతుల బెడద వల్ల అనేక మంది విద్యార్థులు గాయాలపాలవుతున్నారని అన్నారు.

# మత్తు వ్యసనానికి దూరంగా ఉండాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** యువత, విద్యార్థిని, విద్యార్థులు గంజాయి, క్రొకైన్, దూమపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరిన్ విద్యార్థులను కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ సమాజానికి దిశా నిర్దేశకులు, మంచి సమాజ నిర్మాతలు విద్యార్థిని, విద్యార్థులు, యువకులనేనని అటువంటి వారు సమజానికి ఆదర్శంగా నిలవాలని ఆమె కోరారు. నేరానికి పాల్పడిన వారికి 20 సంవత్సరాలు వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉన్నదని, అందువల్ల మాదక ద్రవ్యాలను వినియోగించి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, స్థానిక ఎస్ఐ మోహన్‌బాబు, న్యాయశాఖ సిబ్బంది అనిత, సుశీల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైక్‌సెట్ బహుకరణ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** దాతల సహాయంతోనే పాఠశాల అభివృద్ధి జరుగుతుందని మాజీ సర్పంచ్ గుమ్మడెల్లి అంజయ్య అన్నారు. మండల పరిధిలోని సర్వారం ప్రాథమికొన్నత పాఠశాలకు ఆయన 20వేల రూపాయల విలువగల మైక్‌సెట్‌ను పాఠశాలకు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేకల రాజారావు మాట్లాడుతూ దాతలు ముందుకు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం దాతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతకాయల వినోద నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కందుల పద్మ నాగిరెడ్డి, ఎపిపిసి చైర్మన్ సిద్ధం త్రివేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ సిపిఐ(ఎం) నిరసన

**ప్రజాపక్షం/రామన్నపేట** : వెనిజుల దేశం పై సామ్రాజ్యవాద అమెరికా ఆధిపత్యాన్ని ప్రజలంతా ముక్తకంఠంగా ఖండించాలని సిపిఎం జిల్లా నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య అన్నారు. వెనిజుల అధ్యక్షుడు మధురో నీకోలాస్ అతని భార్యను అమెరికా దళాలు అక్రమంగా తమ దేశానికి తరలించి నిర్బంధించడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు, కల్లూరి నగేష్, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు పాల్గొన్నారు.





## అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణ శివారులో ఫణిగిరి సీతరామచంద్రస్వామి గుట్ట వద్ద పేదవాడికి ఇల్లు ఇవ్వడమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న 2160 సింగిల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు కోసం హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలో అర్హులైన వారి నుండి దరఖాస్తులను హుజూర్‌నగర్ తహసిల్దార్ కార్యాలయంలో స్వీకరిస్తున్నట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణ నేటి నుండి ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని, ఉదయం 1030 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు తీసుకుంటారని, హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని అర్హులై ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎఎస్‌డి ప్రేమ్‌కరణ్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ కవిత, ఎంపిడివో సుమంత్, హౌసింగ్ డిఈ జగన్ పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పొనుగోడు గ్రామంలో క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాలను గుర్తించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. వరసగా మూడు రోజులు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ క్రీడాస్ఫూర్తిని చాటాలని, స్నేహపూరిత వాతావరణంలో క్రీడలు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ చలిగంటి నరేష్, గ్రామ సర్పంచ్ కటికం వేణు, ఉప సర్పంచ్ జోగు అరవింద్‌రెడ్డి, మాజీ ఎంపిపి కటికం ఆశ రమేష్, మాజీ సర్పంచ్ జోగు సరోజనమ్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్లు పంపిణీ



**ప్రజాపక్షం/ఆలేరు:** గ్రామీణ నిరుపేద యువతులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా కుట్టు పనిలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నది. ఈ పథకంలో భాగంగా ఆలేరు మండలంలో కుట్టు శిక్షణ పొందిన 450 మంది మహిళలకు మొదటి విడతలో 176 మందికి కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు పోస్టుమాస్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయి సదానంద్, కేతావత్ చందు, గోపీనాథ్, గణేష్, లబ్ధిదారులు లకావత్ సునీత, పేరపు లక్ష్మి ఉన్నారు.

## రిలే నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్ష రూపాయలు రుణమాఫీని వెంటనే అమలు చేసి డబ్బులు ఖాతాలో జమ చేయాలని కోరుతూ గురువారం బిజెపి మండల పట్టణ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన దీక్షలో పలువురు బిజెపి నాయకులు పాల్గొని చేనేత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్, మాజీ ప్రధాన కార్యదర్శి యెన్నం శివకుమార్, చిక్క కృష్ణ, పట్టణ అధ్యక్షులు డబ్బికార్ సాహెష్ పాల్గొన్నారు.



## టీషర్ట్స్ బహుకరణ

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగర్ గ్రామంలో యువ నాయకుడు సింగనబోయిన గణేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద అభిమానులు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి బెడ్ షీట్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 130 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ టీ సెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గర్దాసు విక్రమ్, ఉపసర్పంచ్ నల్ల స్వామి జయసుధ, వార్డ్ మెంబర్లు, వివిధ కుల సంఘాల నాయకులు, చిన్ననాటి స్నేహితులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్ పూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని గోపాలపురం గ్రామంలో సర్పంచ్ పుట్ట సాయిలు అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ సభ ముఖ్య ఉద్దేశం పారిశుద్ధ్య వారోత్సవాలు పురస్కరించుకొని ప్రతిరోజు, ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించడం జరుగుతుందని, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల శుభ్రం చేయుట, రోడ్డు పక్కన, పిచ్చి మొక్కలు తొలగించుట, శుక్రవారం డ్రైడేను పాటించడం జరుగుతుందని తెలిపారు. నెలలో మూడు సార్లు వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని, పైప్ లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మత్తులు చేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె.బాలరాజు, ఉపసర్పంచ్ కొండబోయిన శ్రీశైలం, వార్డ్ సభ్యులు కాశబోయిన కనకమ్మ, తిపరబోయిన సంతోష్, మలెబోయిన అశోక్,పుట్ట గీత, నారం కృష్ణ వేణి, కూర కనకయ్య, దాసరి పరమేశ్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## శంకర్‌నాయక్‌కు శుభాకాంక్షలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌ను తుంగపాడు గ్రామ సర్పంచ్ బెదుడూరి వెంకట్‌రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుగట్ల లింగయ్యయాదవ్‌లు గాంధీభవన్‌లో కలిసి శుభాకాంక్షల తెలిపారు. వారి వెంట నాయకులు సుధీర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మచ్చ వెంకన్న, చింతరెడ్డి సైదిరెడ్డి, చెన్నారెడ్డి, శాకం కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్, ఉపసర్పంచ్ నరసింహా తదితరులు ఉన్నారు.



## 18న ఖమ్మంలో సిపిఐ బహిరంగ సభకు తరలిరావాలి



ప్రజాపక్షం/మర్రిగూడ: ఖమ్మం జిల్లాలో ఈనెల 18నజరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల కన్వీనర్ బుర్ర శేఖర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తానేదార పల్లి శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ కాన్పూర్ లో డిసెంబర్ 25,1925సంవత్సరంలో ఆవిర్భావించి పేద ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించారని అన్నారు. ఖమ్మం జిల్లాలో18న జరుగుతుందని ఈసభ కు అని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అబ్బనగోని కృష్ణయ్య, అంజయ్య, రమేష్ పాల్గొన్నారు.

## 'రాముడి దురాశ' కథకు చోటు



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వ్రాసిన కథకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. హైదరాబాద్‌కు చెందిన బాలచెలిమి చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమి వారు నిర్వహించిన జాతీయ కథల పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు వ్రాసిన 'రాముడి దురాశ' కథకు చోటు దక్కింది. ఈ పోటీలో పాల్గొని కథలు వ్రాసిన విద్యార్థులు జెల లహరి, ఎన్ శాన్విశ్రీ, ఎస్ తేజశ్రీ, ఏ శేషు, ఏ అక్షిత, ఎండి మహిక్, ఆర్ దివ్య, ఆర్ సృజన, షేక్ నఫీస, ఎండి మదియా, ఆర్ హోని, డి మేరీ, ఆర్ బబితలను బాల చెలిమి చైర్మన్ మణికొండ వేదకుమార్, కన్వీనర్ గరిపల్లి అశోక్‌లు పంపించిన ప్రశంసా పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోగికార్ రమాదేవి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ ఉప్పల పద్మ, ఉపాధ్యాయులు మసరం శ్రీనివాస్, అందాలు, వెంకట్రావు, షరీఫ్, రాంరెడ్డి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలు పరిష్కారం కాదు.. మానసిక ఒత్తిడిని జయించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: విద్యార్థినులలో ఉండే మానసిక సమస్యలు, హార్మోన్ల సమతుల్యత లోపించడం వలన వచ్చే సమస్యలు వచ్చినపుడు ఆత్మహత్యలు అనేది సమస్యకు పరిష్కారం కాదని మానసిక ఒత్తిడిని జయించాలని ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ విజయ్ అన్నారు.వ్యక్తిత్వ వికాసం మరియు మానసిక వికాసం పై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహం ఎ.బి.మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల,కాలేజ్ అప్పాజీపేటలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జి వి రమేష్ జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక రకాలైన సంక్షేమ కార్యక్రమాల్ని ప్రవేశపెట్టింది విద్యార్థినులు వారి లక్ష్యం వైపు ప్రయత్నం చేసి మంచి ఫలితాలను సాధించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా ఇజాస్ ఇక్తియర్,వసతి గృహ సంక్షేమ సంక్షేమ అధికారి నిలు రమ్య సుధ,సునీత ,బిసి గురుకుల ప్రిన్సిపాల్ భవాని,దుబ్బ అరుణ కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## యువత కొత్త ఆలోచనలతో పరిశోధనలు చేయాలి



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : యువత కొత్త ఆలోచనలతో పరిశోధనలు చేయాలని సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చావా రాజ్ కుమార్, భువనగిరి పట్టణ సీఐ ఎం.రమేష్ అన్నారు. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటండి యంగ్ ఇండియా యంగ్ లీడర్షిప్ (ONE STOP SOLUTION FOR YOUTH) ఎన్జీవో ఆర్గనైజేషన్ 15వ సమావేశం గురువారం భువనగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చావా రాజ్ కుమార్ మాట్లాడుతూ లీడ్ టుడే చేంజ్ టుమారో అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సంస్థ, మీ ఆలోచనలు సకారం చేసే ఇది ఒక చర్చవేదిక అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మహేశ్వర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ అంభోజు మల్లేశం, జాయింట్ సెక్రెటరీ యేంపాల కొండల్ రెడ్డి, ట్రెజరీ వెంకట్ రాజు గౌడ్, జాయింట్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్, గాజుల వెంకటేష్ గౌడ్, శ్రవణ్ రెడ్డి, సంపత్ కుమార్ గౌడ్, కళాశాల అధ్యాపకులు కిష్టయ్యా, సత్యనారాయణ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మాథ్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చాటిన మేఘన



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన మాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బకల్‌వాడిలో విద్యనభ్యసిస్తున్న కె.మేఘన ప్రతిభ చాటి ప్రథమస్థానంలో నిలిచింది. గురువారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వి.కరుణాకర్‌రెడ్డి మేఘనను అభినందించి నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాన్ని అందించి మాట్లాడారు. మేఘన మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు చిన్నయ్య, శ్రీదేవి, గిరిజ, స్వాతి, బాలు, వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



## స్టడీ మెటీరియల్స్ అందజేత

ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం పదవ తరగతి చదువుచున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను గురువారం అందజేశారు. 1985/86 ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నారు. అందులో భాగంగా నేడు స్టడీ మెటీరియల్స్‌తో పాటు, పరీక్షలకు కావల్సిన ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్ తదితర వస్తువులను గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోయగూర శ్రీనివాస్‌గౌడ్, ఎదుళ్ళ ప్రభాకర్‌రెడ్డి, సప్పిడి మోహన్‌రెడ్డి, పొట్లపల్లి వెంకన్నగౌడ్, సప్పిడి సీనారెడ్డి, చొల్లేటి రాజన్‌బాబు పాల్గొన్నారు.

## ఆలేరు నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం



ప్రజాపక్షం/ఆలేరు : గాంధీ భవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ జనగామ ఉపేందర్ రెడ్డి ఈ సందర్భంగా కార్యవర్గ సమావేశంలో చర్చించిన విషయాలను విలేకరులకు తెలిపారు. ఉపేందర్ రెడ్డి రాబోయే మున్సిపల్ ఎన్నికలతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి చూపించామని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టి గుండు సున్నాకు తీసుకువెళ్లామని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీలు ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపల్ పీఠాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఉపేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ పల్లె శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## పలువురి కుటుంబాలను పరామర్శ



ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణ,మండలంలోని చందుపట్ల గ్రామంలో పలువురి కుటుంబాలను గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామ 1వవార్డు సభ్యులు కొల్లు సుగుణమ్మ ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలనుఅడిగితెలుసుకున్నారు.అనారోగ్యంతో మరణించిన చందుపట్ల గ్రామానికి చెందిన కామళ్ల సుధీర్ వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 06వ వార్డుకి చెందిన దోరపల్లి భిక్షమయ్య అనారోగ్యంతో మరణించగా మృతదేహానికి పూలమాల వేసినివాళులర్పించి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు.

## గోడపత్రిక ఆవిష్కరణ



ప్రజాపక్షం/మర్రిగూడ: తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో చలో సూర్యాపేట గోడపత్రికను ఆవిష్కరించారు. 10న సూర్యాపేటలో జరిగే ఉద్యమకారుల మహాసభను జయప్రదం చేయాలని కోరారు.తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర అధ్యక్షుడు కోరే సాయిరాం,జిల్లా అధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.



## మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి

**ప్రజాపక్షం/డిండి;** డిండి (గుండ్లపల్లి) మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా శాంతిగూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం డిండి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల సర్పంచ్‌ల సమావేశంలో భాస్కర్‌రెడ్డిని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందున సర్పంచ్‌లందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం భాస్కర్‌రెడ్డిని మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం తవక్లాపూర్ గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య గురువారం గ్రామంలోని వృద్దులకు దుప్పట్లను పంపిణి చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా వృద్దులు చలి తీవ్రత వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నందున చలి నుండి కాపాడుకునేందుకు వృద్దులకు దుప్పట్లు పంచాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు జైపాల్, శ్రీను, చంద్రయ్య, ఇస్తేరమ్మ, సుజాత, గ్రామ పెద్దలు, యువకులు, బ్రహ్మయ్య, ప్రేమయ్య పాల్గొన్నారు.

## ఎంపిడిఓకు సన్మానం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని చెన్నారం గ్రామ పంచాయతీ సర్పంచ్ రమావత్ తులసి రాంనాయక్ గురువారం ఎంపిడివో స్వర్ణలతను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, పూలమొక్కను బహుకరించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ, సినియర్ అసిస్టెంట్ వినోద్‌రెడ్డి, ఏవివో రామచంద్రం, జంగిటి మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత దాడులను ఖండిస్తున్నాం

**-ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** బంగ్లాదేశ్‌లో గత కొన్ని సంవత్సరాలుగా మైనార్టీలైన హిందూ ప్రజలపైన జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని విద్యావంతుల వేదిక నాయకులు, న్యాయవాది కట్టెల లింగస్వామి పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మైనార్టీ మత ప్రజలపైన దాడులు రోజురోజుకు పెరగడం పెరుగుతున్న మతోన్మాదానికి నిదర్శనమని ఆయన అన్నారు. జాత్యహంకార దాడులు, మత అహంకార దాడులు ప్రపంచ ప్రజల మధ్య సోదర భావాన్ని దెబ్బ తీస్తున్నాయని, మానవత్వానికి మంటలు రాజేస్తున్నాయని అన్నారు. ఆధిపత్యం కోసం మనుషులను చంపే మతం అసలు మతమే కాదని, ఏ మతం కూడా తోటి మనుషులను చంపమని చెప్పలేదని అది వారి మతానికే వ్యతిరేకమని ఆయన అన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థి దశ నుండే అవగాహన



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** రోడ్డు భద్రతపై విద్యార్థి దశ నుండే అవగాహన అవసరమని మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ జిలానీ షేక్ అన్నారు. గురువారం రవాణా శాఖ కోదాడ యూనిట్ ఆఫీస్ ఆధ్వర్యంలో మాంటెసోరి స్కూల్, న్యూవిజన్ స్కూల్, జడ్‌పిహెచ్‌ఎస్ నల్లబండగూడెంలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం ద్వారా ప్రమాదాలు జరిగితే ప్రాణాపాయాలు తక్కువ ఉంటాయన్నారు. సీటుబెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే నిబంధనలను వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించే అంశాలను అవగాహన కల్పించారు. చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నియమాలు అలవర్చుకుంటే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఆఫీస్ కోదాడ రవాణా శాఖ సిబ్బంది జిఆర్ చరణ్, సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

## ఆకాంక్షలో ముందస్తు సంక్రాంతి సంబురాలు



**ప్రజాపక్షం/హాలియా:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక ఆకాంక్ష ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించినారు.ఈ సందర్భంగా విద్యార్థి ,విద్యార్థినుల మాతృమూర్తులు ముగ్గుల పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రంగులతో ముగ్గులు వేసి తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గులను అలంకరించారు. అనంతరం గెలుపొందిన మాతృమూర్తులకు కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు.మొదటి బహుమతి రూ. 5116 లు, ద్వితీయ బహుమతి రూ.3116 లు, తృతీయ బహుమతి రూ.1116 కన్సోలేషన్ బహుమతి, రూ.516 లు ఇద్దరికీ ముగ్గుల పోటీలలో పాల్గొన్నా ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు.ఈకార్యక్రమంలో డైరెక్టర్ ఉన్నం శ్రీను బాబు, ప్రిన్సిపాల్ మోదాల రవీందర్,వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్ కరీం,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మర్రూరులో ఉచిత కంటి వైద్య శిబిరం




**ప్రజాపక్షం/నకిరేకల్ :**మండలంలోని మర్రూరు గ్రామంలో నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా 20 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. అందులో ముందుకు వచ్చిన నలుగురిని ఉచిత కంటి ఆపరేషన్ల కోసం సూర్యాపేట కంటి ఆసుపత్రికి తరలించారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, గ్రామ సర్పంచ్ నర్సింగ్ సరిత శ్రీనివాస్, వృద్ధాశ్రమం ట్రస్ట్ చైర్మన్ ఎన్.రామ్మోహన్రావు,క్లబ్ కార్యదర్శి సూర్యచంద్రరావు, డెంటల్ డాక్టర్ కందాల వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## టిఎఇఒఎస్ యూనియన్ సూర్యాపేట జిల్లా కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** టిఎన్‌జిఓ ఆధ్వర్యంలో తెలంగాణ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (టిఏఇఓఎస్) యూనియన్ సూర్యాపేట జిల్లా కమిటిని గురువారం జిల్లా కేంద్రంలోని టిఎన్‌జిఓ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎలక్షన్ ఆఫీసర్లుగా టిఎన్‌జిఓ జనరల్ సెక్రటరీ దున్న శ్యామ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా టిఏఇఓఎస్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా టిఏఇఓఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా పెద్దపంగ ప్రణయ్ (ఏఇఓ దుపహాడ్), జనరల్ సెక్రటరీగా ధరావత్ మనోజ్ కుమార్ (ఏఇఓ పొనుగోడు), ట్రెజరర్‌గా షేక్ ముస్తఫా (ఏఇఓ లింగగిరి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆత్కూరి ఉప్పయ్య (ఏఇఓ బృందావనపురం), యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ టిఎన్‌జిఓ వైస్ ప్రెసిడెంట్ వహీద్, సూర్యాపేట జిల్లా ఏఇఓలు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిది



**ప్రజాపక్షం/చండూరు:** సీఎం సహాయ నిధి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రేస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సహకారంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 57 మంది సీఎం రిఫీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన 18లక్షల 9వేల రూపాయల చెక్కులను గురువారం చండూరులో లబ్ధిదారులకు ఓంకారం అందజేశారు. ఈకార్యక్రమంలో చండూరు ఎఎంసి వైస్ చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ భూతరాజు ఆంజనేయులు , సర్పంచ్‌లు ముక్కాముల వెంకన్న, గిరి కరుణాకర్ , శివాని సురేష్ , వెంకన్న పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ కె సీతారామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడేలా ఉందన్నారు. ఉద్యోగులకు కావల్సిన ముఖ్యమైన తేదీలను ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, భూక్య పాండు నాయక్, నాగేందర్, రవికుమార్, స్వప్న, యాదగిరి, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా గానుగబండ



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** సర్పంచ్ ఎన్నికల ముందు ప్రజలు ఆశీర్వదించి తనని గెలిపిస్తే గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తాను గ్రామ ప్రజలకు మాట ఇచ్చానని దాన్ని నెరవేర్చేందుకు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మండల పరిధిలోని గానుగుబండ గ్రామ నూతన సర్పంచ్ మాతంగి వెంకటమ్మ కరుణాకర్ అన్నారు. గ్రామ పంచాయితికి నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉందని అంత వరకు ప్రజలు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో తన సొంత నిధులను వెచ్చించి తన గ్రామానికి వచ్చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను జెసిబిలతో తొలగించే రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కంచర్ల కుశలవరెడ్డి, మాదగని సోమయ్య, వార్డు సభ్యులు దండె రమణ, బిజెపి నాయకులు యనగందుల రాంచందర్ పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ




**ప్రజాపక్షం/హాలియా:** పోలీసుల ఆధ్వర్యంలో హాలియాలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో నో హెల్మెట్‌నో పెట్రోల్ నినాదంతో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించేందుకు గురువారం హాలియాలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగం దాని ప్రాముఖ్యత తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం మిర్యాలగూడ రోడ్డులోని పెట్రోల్ బంకును సందర్శించిన డి.ఎస్.పి హెల్మెట్ ధరించకుండా వచ్చిన వాహనదారులకు పెట్రోల్ సరఫరా చేయరాదని సూచించారు.ఈ కార్యక్రమంలో హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్, నిడమనూరు ఎస్ఐ సురేష్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో వార్డులో డ్రైనేజీల శుభ్రత

**ప్రజాపక్షం/నకిరేకల్ :**నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో గురువారం మున్సిపల్ సిబ్బంది జేసీబీ సహకారంతో డ్రైనేజీలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ పరిశీలించారు.పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.



# విద్యార్థులకు పోషక పదార్థాలు

## కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** విద్యార్థులకు తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అనిమియా తగ్గించేందుకు అవసరమైన అన్ని ఆరోగ్య సేవలు, అవసరమైన పోషక పదార్థాలు అందించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని విసి హాల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ పెండెం వెంకటరమణ తమ శాఖ ద్వారా అమలులో ఉన్న వివిధ సంక్షేమ పథకాల అమలుతీరును వివరించారు. గత నెలతో పోల్చినప్పుడు పథకాల అమలులో గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిపారు. ముఖ్యంగా మాతా శిశు సంరక్షణ సేవల పరిధిలో గర్భిణీల నమోదు, గర్భిణీలకు నిర్వహించిన వైద్య పరీక్షలు, సురక్షిత కాన్పుల నిర్వహణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకునే సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలకు నియోజక వర్గం వారీగా స్కానింగ్ చేయుటకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కోటిరత్నం పసిపిల్లల టీకాల కార్యక్రమంలో 101 శాతం లక్ష్యం సాధించామని, ప్రత్యేక వాక్సినేషన్ డ్రైవులు నిర్వహించినట్లు తెలిపారు. అదనంగా తొలి దశలో పిల్లల జీరో డోసుల టార్గెట్‌లో వెనుకబడిన సమయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ప్రైవేట్ ఆసుపత్రిని సందర్శించి, అక్కడ జన్మించిన పిల్లల టీకా వివరాలను ప్రతి ప్రైవేట్ యాజమాన్యం తప్పనిసరిగా బిఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించినట్లు తెలిపారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లలకు జీరో డోస్ నుంచి టీకాలు అందించడం వలన 100 శాతం టీకాకరణ సాధ్యమైందని పేర్కొని, ఈ విషయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఎన్‌సిడి కేసుల గుర్తింపు, ఫాలోఅప్ చికిత్సలు నిర్ధిష్ట ప్రమాణాల ప్రకారం 100 శాతం నిర్వహించబడుతున్నాయని డాక్టర్ డిప్యూటి డిఎంహెచ్‌ఓ జి చంద్రశేఖర్ తెలిపారు. అలాగే టిబి కేసుల గుర్తింపు, చికిత్స, ఫాలోఅప్ కూడా పూర్తి స్థాయిలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో కొత్తగా 17 టిబి కేసులు గుర్తించబడినట్లు డాక్టర్ ప్రసిద్ వివరించారు. మన సూర్యాపేట జిల్లాలో కొత్త టిబి కేసులు వ్యాప్తి చెందకుండా కట్టడి చేయాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ పెండెం వెంకటరమణ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, డాక్టర్ కోటిరత్నం, డాక్టర్ జి చంద్రశేఖర్, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ మాధవ్ కుమార్, డాక్టర్ నాజియ తబస్సుం, సంజీవరెడ్డి, డిప్యూటి డెమో ఉమా మహేశ్వరి, డిపిఎం, జిల్లావైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్యవివాహాల వల్ల బాలికల భవిష్యత్ నాశనం

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్వీన్‌కౌసర్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్ నాశనం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్వీన్ కౌసర్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహ ముక్త్ అభియాన్ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్వీన్ కౌసర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని బాలికలు, 21 సంవత్సరాలు నిండని బాలుర వివాహాలు చట్టవిరుద్ధమని, అటువంటి వివాహాలు నిర్వహించిన వారిపై బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్యకు ఆటంకం కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు, మాతృమరణాలు, శిశు మరణాలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి రజిత గోపు మాట్లాడుతూ బాల్య వివాహల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ లైన్ 1098, పోలీస్ స్టేషన్ 100 లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాలలో బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామ సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను నివారించాలని కోరారు. ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి మాట్లాడుతూ బాలికలను చదివించి ఉన్నత స్థానాలకు చేరేంత వరకు వివాహం చేయకూడదని సూచించారు. సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమతా మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు వివాహం చేస్తే 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1లక్ష జరిమానా విధించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు చట్టాలను గౌరవించాలని కోరారు. ఆర్‌టిసి డిఎం సునీత బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. అంతకు ముందు బాలసదన్ విద్యార్థులచే ఆర్థికస్తోమత లేక ముగ్గురు ఆడపిల్లల తల్లి పెద్ద అమ్మాయికి బాల్య వివాహం చేయటం ఆ వివాహాన్ని అధికారులు అడ్డుకోని ఆమెను బాలసదన్‌లో చేర్పించి జాబ్ వచ్చేంత వరకు ప్రభుత్వమే చదివిస్తుందని ప్రదర్శించిన నాటకం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డిఎల్‌ఎస్‌ఏ నామినేటెడ్ మెంబర్స్ గుంటూరు మధు, నల్లపాటి మమత, డిప్యూటి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె ప్రియదర్శిని, పారా లీగల వాలెంటీర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని కేతేపల్లి గ్రామంలో గత కొంతకాలంగా ఉన్నటువంటి విద్యుత్ సమస్య ఉండగా గురువారం గ్రామంలో నూతన 25కెవి ట్రాన్స్ఫారం,16 విద్యుత్ స్తంభాలు తో పాటు నూతన లైన్ మార్గం,అంగన్వాడీ పాఠశాల వద్ద 15 కెవి ట్రాన్స్ఫారం ను 25 కెవి ట్రాన్స్ఫారం గా మార్చడం జరిగింది.దానితోపాటు వ్యవసాయ భూములకు సరఫరా అయ్యే కరెంట్ స్థంబాల నుండి వెళ్ళే వైర్లు క్రిందికి ఉండగా ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో నూతనంగా 8 విద్యుత్ స్తంభాలు నాటి వాటిని సరి చేయడం జరిగింది.కేతేపల్లి గ్రామ విద్యుత్ సమస్య కొరత లేకుండా ప్రత్యేకంగా సహకరించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి గ్రామీణ క్రీడోత్సవాల నిర్వహణ కరపత్రం ఆవిష్కరించారు. కెహెచ్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు మజ్జిగ నరేష్, కార్యదర్శి తొండల అనిల్ తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు ప్రథమ బహుమతి 6,116, చీర, ద్వితీయ బహుమతి 5116, చీర, తృతీయ బహుమతి 4116, చీర, క్యారమ్ బోర్డు డబుల్స్ ప్రథమ బహుమతి 5116, ద్వితీయ బహుమతి 3116, క్యారమ్ సింగిల్స్ ,ప్రథమ బహుమతి 3116, ద్వితీయ బహుమతి 2116, చెస్, ప్రథమ బహుమతి 3,116, ద్వితీయ బహుమతి 2,116, రసాకాసి తెలిపారు.

## దరఖాస్తులకు పరిష్కారం



**ప్రజాపక్షం/యాదాద్రి :** మధ్యాహ్నం నుండి మొదలైన ప్రత్యేక గ్రీవెన్స్‌కు ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తు, కొన్ని సమస్యలను అప్పటి కప్పుడే పరిష్కరించటం జరిగిందని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌కు, ఉద్యోగవాణి కార్యక్రమంలో వినతుల వెల్లువ ముఖ్యంగా దీర్ఘ కాలంగా ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను కలెక్టర్ పిలిచి మరి సుమారు 80 ఫైల్స్‌ను కలెక్టర్ క్లియర్ చేశారు.బొమ్మల రామారం మండలం మర్యాల గ్రామంలో సమాధుల స్థలం కోసం కొందరు వ్యక్తులు కబ్జా చేయడం జరిగిందని వినతి పత్రం ఇవ్వడంతో వెంటనే సంబంధిత బొమ్మల రామారం తహసీల్దార్‌కి ఫోన్ చేసి వెంటనే కబ్జాచేసిన స్థలం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



## ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని సన్‌షైన్ పాఠశాలలో గురువారం ముందస్తు సంకాంత్రి పండుగ వేడుకలను నిర్వహించుకున్నారు. ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలు , హరిదాసు వేషదారణలు, గంగిరెద్దుల వేషధారణలు , రైతు కుటుంబం వేషధారణలలో విద్యార్థులు అలరించారు. రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దిన విధానం అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న, డైరెక్టర్ కోడి సుష్మా, ప్రిన్సిపాల్ రవికాంత్ , రమేష్ , లతీఫ్,ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని రామ్ రెడ్డిపల్లి గ్రామపంచాయతీలో మాల్ పీపుల్స్ హాస్పిటల్,మన్నెగూడ మావోయి హాస్పిటల్ సర్పంచ్ లప్పంగి నరసింహాఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బిపి,షుగర్,ఈసీజీ పరిక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొగాకు సైదులు,నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వి.రవీందర్ రావు,మాజీ ఎంపీపీ పాముల యాదయ్య, నక్క వెంకటయ్య,పీపుల్స్ హాస్పిటల్ యజమాని డాక్టర్ భాస్కర్, సువర్ణ హాస్పిటల్స్ సిబ్బంది పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## చింతలపాలెం తహసీల్దారుగా సూరయ్య


**ప్రజాపక్షం/చింతలపాలెం :** చింతలపాలెం తహసీల్దార్‌గా సూరయ్య గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీరు కోదాడలో డిప్యూటి తహశీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి అదనపు బాధ్యతలుగా బదిలీపై వచ్చారు. ప్రస్తుత తహశీల్దార్ సురేందర్ రెడ్డి హుజూర్‌నగర్ ఆర్‌డిఓ ఆఫీసుకు (డిఏఓగా) బదిలీ అయ్యారు.

## రికార్డుల పరిశీలన



**ప్రజాపక్షం/నిడమనూరు:** పోలీస్ స్టేషన్ రికార్డులు లను మిర్యాలగూడ ఎస్డిపిఓ కె రాజశేఖర్ రాజు వార్షిక తనిఖీలో భాగంగా హాలియా సీఐడి సతీష్ రెడ్డితో కలిసి గురువారం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు.స్టేషన్ రికార్డులతో పాటు పెండింగ్ కేసుల వివరాలను పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై ఉప్పు సురేష్ ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా వివరించాలని సూచించారు. ఎస్డిపిఓ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులపంపిణీ



**ప్రజాపక్షం/నాంపల్లి:** ప్రజా పాలన లో భాగంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో పేదల పాలిట వరంగా మారిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నాంపల్లి మండల కేంద్రంలో గురు వారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా,61 మంది లబ్ధిదారులకు గాను 26 లక్షల 9వేల రూపాయల చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఏరేడ్ల రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.